**కె.బాలగోపాల్**

# విచారణలు, విషాదాలు!



'సల్వాజుడుం' అని పిలవబడే సంస్థ లేక ఉద్యమం లేక రౌడీమూక చత్తీస్‌గఢ్ ప్రభుత్వం అండదండలతో నిరాయుధులైన ప్రజల మీద హింసకు పాల్పడుతున్నదన్న అభియోగంపైన విచారణ జరిపి నివేదిక ఇమ్మని జాతీయ మానవహక్కుల కమిషన్‌ను సుప్రీం కోర్టు ఆదేశించటం చాలామందికి సంతోషం కలిగించింది. సంతోషించడంలో ఆక్షేపించడానికేం లేదుగానీ, ఎవరిమీదనయితే విచారణ జరుపబోతున్నారో వారు దాన్ని సాగనివ్వరనీ, ఏ ప్రభుత్వం అండదండలతో వాళ్లు యథేచ్ఛగా హింసకు పాల్పడుతున్నారన్న అభియోగాన్ని కమిషన్ విచారించబోతున్నదో ఆ ప్రభుత్వం అండదండలతోనే అడ్డుపడబోతారనీ నిస్సంకోచంగా చెప్పవచ్చు.

విచారణ వస్తువే విచారణ ప్రక్రియకు ఆటంకమయితే విచారణ కమిషన్ ఏం తేల్చగలుగుతుంది? దాదాపు 14 ఏళ్ల కింద ఇదే జాతీయ మానవహక్కుల కమిషన్ ఆంధ్రప్రదేశ్‌లో ఒక విచారణ కోసం తరలివచ్చింది. పోలీసులు ఎన్‌కౌంటర్ల పేరిట హత్యలకు పాల్పడుతున్నారన్న అభియోగాన్ని విచారణకు స్వీకరించాక ఈ విషయంలో ప్రజలేమనుకుంటున్నారో తెలుసుకోవడానికి అది బయలుదేరి వచ్చింది. వచ్చినవాళ్ళు చిన్నాచితక మనుషులు కారు. సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఒకరు, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి ఒకరు, ఇద్దరు హైకోర్టు మాజీ న్యాయమూర్తులు, ఒక రిటైర్డ్ కేంద్ర ప్రభుత్వ అధికారీ వచ్చారు. కరీంనగర్, వరంగల్, నల్లగొండలలో విచారణ నిర్వహించారు. వారికి తెలిసిన ఏకైక పద్ధతిలో నిర్వహించారు. ఒక ప్రభుత్వ అతిథి గృహాన్ని విచారణ కేంద్రంగా ఎంచుకున్నారు. ఫలాన తేదీ పొద్దున్న 10 గంటల నుంచి ఫలానచోట విచారణ జరుగుతుందనీ ప్రజలెవరైనా వచ్చి ఎన్‌కౌంటర్ల విషయంలో గానీ మొత్తంగా నక్సలైట్ ఉద్యమం, ప్రభుత్వ చర్యలు అనే అంశాల మీదగాని చెప్పవలసిందేమైనా ఉంటే చెప్పవచ్చునని పత్రికా ప్రకటన ఇచ్చారు.

మేము మూడు జిల్లాలలోనూ ఎన్‌కౌంటర్ మృతుల కుటుంబాలను ఒక జీపులో పట్టేంత మందిని సమీకరించి తీసుకుపోయాము. అంతకంటె మాకు స్తోమతా లేదు, బాధితులలో కదలికా లేదు. ఒక్క కరీంనగర్‌లో మాత్రం విచారణ సక్రమంగా జరిగింది. అంటే పోలీసులు జోక్యం చేసుకోలేదు. మేము విచారణ స్థలానికి పోగానే కరీంనగర్ డిఎస్‌పి వచ్చి కరచాలనం చేసి 'ఇది మీ రోజు, మా జోక్యం ఉండదు' అన్నాడు. మేము తీసుకొచ్చిన పోలీసు బాధితులు చెప్పవలసింది చెప్పారు. నక్సలైట్ బాధితులు కూడ కొందరొచ్చి వాళ్ళు చెప్పవలసిందీ చెప్పారు. మమ్మల్ని ఒకటి రెండు సూటి పోటి మాటలన్నారు గానీ అల్లరేం జరగలేదు. మరుసటిరోజు వరంగల్‌లో విచారణ జరగవలసిన చింతగట్టు గెస్ట్ హౌస్‌లో మేము వెళ్లే సరికి అప్పటికే చాలా పెద్ద గుంపు పోగయి ఉంది. మేము చూస్తూ ఉండగానే గుంపు ఇంకా పెద్దదయింది. అది మమ్మల్ని అల్లరి పెట్టడానికి పోలీసులు పోగుచేసిన గుంపని అర్థం అయింది. మేము కమిషన్‌కు ఫిర్యాదు చేయడానికి గెస్ట్‌హౌస్ లోపలికి వెళ్లి విజిటర్స్ రూంలో కూర్చున్నాము. అయితే ఈ నాటకానికి డైరెక్టర్ అయిన అప్పటి వరంగల్ ఓ.ఎస్.డి. ఉమేష్ చంద్ర వచ్చి 'ఇది మీరు కూర్చోవలసిన చోటు కాదు. బయటకు వెళ్లండి' అన్నాడు. తాను పోగుచేసిన గుంపు చేత దెబ్బలు తినకుండ మేము తప్పించుకుంటామేమోనని అతని ఆదుర్దా.

కొంతసేపటికి కమిషన్ తన విచారణ మొదలుపెట్టింది. మేము తీసుకొచ్చిన పోలీసు బాధితులు కొంచెం చెప్పారు. అంతలో పోలీసులు తెచ్చిన గుంపు దాడికి దిగారు. మాపైన చేయిచేసుకున్నారు. అక్కడున్న పోలీసులు చోద్యం చూస్తూ నిలబడ్డారు. కొంచెం సేపటికి మానవహక్కుల కమిషన్ పెద్దలు జోక్యం చేసుకొని అందరినీ శాంతంగా ఉండవలసిందిగా కోరుతూ మాట్లాడారు. ఆ తరువాత సద్దుమణిగిందిగానీ పోలీసు బాధితులెవ్వరూ అక్కడ మిగలలేదు. నక్సలైట్ బాధితులు మాత్రం మిగిలారు. కమిషన్ వారి వాంగ్మూలాలు స్వీకరించి విచారణ ముగించింది. పోలీసుల లక్ష్యం నెరవేరింది. మరుసటి దినం నల్గొండలోనూ అదే జరిగింది. మాకు హాని జరగగలదని భయపడి కన్నబిరాన్‌గారు స్వయంగా రాగా ఆయన పైన కూడ చేయి చేసుకున్నారు.

రేపు సుప్రీంకోర్టు ఆదేశం మేరకు జాతీయ మానవహక్కుల కమిషన్ చత్తీస్‌గఢ్‌లో చేపట్టబోయే విచారణ ఇంతకంటే కూడ ఏకపక్షంగా ముగియగలదు. దానికి రెండు కారణాలున్నాయి. ఇక్కడ నిరంతరాయంగా ప్రజలహక్కుల కోసం పనిచేస్తున్నవారమున్నాము. ఆనాడు జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను రప్పించగలిగాము, స్తోమత ఉన్న మేరకు బాధితులను తీసుకుపోగలిగాము. చత్తీస్‌గఢ్‌లో హక్కులకోసం పనిచేసే ఏకైక స్థానిక సంస్థ పియుసిఎల్. వారికి విస్తృత నిర్మాణం లేకపోగా ఆ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బినాయక్ సేన్ ఇప్పటికి ఒక సంవత్సరంగా జైలులో ఉన్నాడు. మరొక కార్యకర్త టి.జి.అజయ్‌ని సుప్రీంకోర్టు ఆదేశం (జాతీయ మానవ హక్కుల కమిషన్ విచారణకు ఆదేశించాక) తరువాత అరెస్టు చేశారు. డాక్టర్ సేన్ మీద అభియోగం జైలులో ఉన్న సన్యాల్ అనే మావోయిస్టు నాయకుడిచ్చిన ఉత్తరాలను బయటున్న మావోయిస్టు పార్టీ నాయకులకు చేరవేశాడని. చేరవేసాడనే అనుకున్నా ఆ ఉత్తరాలలో ఏ హత్యకూ పురమాయింపు లేదు, ఏ విధ్వంసానికీ పథక రచన లేదు. అటువంటప్పుడు అది నేరం ఎట్లాగయింది? ఒక వేళ అయిందనుకున్నా జిల్లా కోర్టు నుంచి సుప్రీంకోర్టు దాకా అన్ని న్యాయస్థానాలలోనూ ఒక సంవత్సరకాలం బెయిల్ నిరాకరించవలసిన అవసరం ఏముంది?

అజయ్ మీద కేసు మరీ అన్యాయమైనది. అతను 2004 ఎన్నికలప్పుడు పరిశీలన నిమిత్తం తిరుగుతుండగా మావోయిస్టు సానుభూతిపరులు అతనిని పోలీస్ ఏజెంట్‌గా అనుమానించి, నిర్బంధించి కెమెరా గుంజుకున్నారు. ఆ కెమెరా తిరిగి ఇప్పించమని అతను మావోయిస్టు నాయకత్వానికి రాసిన ఉత్తరాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు, మావోయిస్టులతో సంబంధాలున్నాయని అజయ్ పైన కేసు పెట్టారు. పాపం అతనికి బెయిల్ దొరకడానికి ఎంతకాలం పడుతుందో? ఒక పక్క పరిస్థితి ఇది కాగా రెండవ పక్క పోలీసులు ఇక్కడ లాగ అక్కడ కొత్తగా నక్సలైట్ వ్యతిరేక గుంపును పోగు చేయనక్కర లేదు. సల్వా జుడుం ఇప్పటికే తయారయివుంది. వాళ్ల చర్యల గురించే జాతీయ మానవ హక్కుల కమిషన్ రేపు విచారణ చేపట్టబోయేది. కోర్టు విచారణను కాదు కదా, వారికి ఏ ప్రమాదమూ కలిగించబోని జర్నలిస్టులు, హక్కుల సంఘాల వాళ్ల విషయ సేకరణను కూడ వారెన్నడూ సహించలేదు. సహించక పోవడం అంటే ఊరికే అభ్యంతరం చెప్పడం కాదు. మీద పడి కొడతారు; నిర్బంధించి కెమెరాలూ పుస్తకాలూ గుంజుకుంటారు; వెంబడించి తరిమేస్తారు. ఖమ్మం జిల్లాకు చెందిన తెలుగు మీడియా ప్రతినిధులు ఈ చేదు అనుభవాన్ని చాలా సార్లు రుచి చూశారు.

అయినప్పటికీ సుప్రీం కోర్టు ఆదేశించిన విచారణ సక్రమంగా జరిగేట్టు చూడడం చాలా అవసరం. మావోయిస్టుల ప్రభావాన్ని ఎదుర్కొనడానికి చట్టబద్ధమైన మార్గాలేవీ

> **సల్వాజుడుం స్వభావాన్ని బహిర్గతం చేయగల మానవహక్కుల కమిషన్ విచారణ సఫలమైతే ఈ క్రమానికి సుప్రీం కోర్టు అడ్డుకట్ట వేయగలదు. దీనికి ఒక మార్గం కమిషన్ తన విచారణను కేవలం దంతెవాడలో జరపకుండా, భద్రాచలంలో గానీ ఏటూరునాగారంలో గానీ కూర్చుని మన రాష్ట్రంలోకి పారిపోయి వచ్చిన చత్తీస్‌గఢ్ వాసుల వాంగ్మూలాలు స్వీకరించడం.**

అనుసరించడం సాధ్యం కాదనుకుంటున్న పాలకులు, మావోయిస్టు బాధితుల, వ్యతిరేకుల పాల్పడే ప్రతీకార హింసకు చట్ట విరుద్ధంగా లైసెన్స్ ఇచ్చి సమాజం మీద వదిలే వికృత మార్గాన్ని ఎంచుకున్నారు. అది సల్వాజుడుం రూపంలో చత్తీస్‌గఢ్‌లో 'సఫలం' అయిందని భావించడం వల్ల జార్ఖండ్‌లోనూ, ఒరిస్సాలోనూ అదే ప్రయత్నం మొదలయింది. మణిపూర్‌లో జరుగుతున్న జాతి పోరాటానికి వ్యతిరేకంగానూ అదే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఎత్తుగడ కేవలం ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచన కాదు. కేంద్ర హోం శాఖే తన తన 2005–2006 నివేదికలో నక్సలైట్ ప్రభావం ఉన్న రాష్ట్రాలలో స్థానిక ప్రతిఘటనా దళాలనూ గ్రామ రక్షణ దళాలనూ ప్రోత్సహించాలని సలహా యిచ్చినట్టు రాసుకుంది; సల్వాజుడుం ఒక మంచి ఉదాహరణ అని ప్రశంసించింది.

సల్వాజుడుం స్వభావాన్ని బహిర్గతం చేయగల మానవ హక్కుల కమిషన్ విచారణ సఫలమైతే ఈ క్రమానికి సుప్రీం కోర్టు అడ్డుకట్టు వేయగలదు. దీనికి ఒక మార్గం కమిషన్ తన విచారణను కేవలం దంతెవాడ జిల్లాలో జరపకుండ భద్రాచలంలో గానీ ఏటూరునాగారంలో గానీ కనీసం రెండు మూడు రోజులు కూర్చుని మన రాష్ట్రంలోకి పారిపోయి వచ్చిన చత్తీస్‌గఢ్ వాసుల వాంగ్మూలాలు స్వీకరించడం. ఎంతలేదన్నా 30 వేల మంది ఇప్పటికి పారిపోయి వచ్చారు. ఎక్కువ భాగం ఖమ్మం జిల్లాలోనూ తక్కువగా వరంగల్ జిల్లాలోనూ తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకొని బతుకుతున్నారు. వాళ్లందరూ మావోయిస్టు అభిమానులు కారు గానీ మినహాయింపు లేకుండ అందరూ సల్వాజుడుం బాధితులే. రకరకాల భయాలు వారి మెదళ్ల పైన పనిచేస్తున్న కారణంగా వారిలో చాలామంది మాట్లాడక పోవచ్చు. కానీ ప్రయత్నం చేస్తే కొద్దిమంది ముందుకొచ్చి విచారణలో పాల్గొంటారు. ఈ అవకాశం మానవ హక్కుల కమిషన్ ఇవ్వక పోతే వారి విచారణ ఘోరంగా విఫలం అయ్యే ప్రమాదం ఉంది. అప్పుడు కేంద్ర ప్రభుత్వం దర్శకత్వంలో వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వినాశకరమైన వ్యూహం అప్రతిహతంగా వ్యాపించే ప్రమాదం ఉంది.